క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

హన్మకొండ (పరకాల): పరకాల సబ్ స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ పరకాల ఏడీ దేవేందర్, ఏఈ సత్యనారయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో పరకాల పట్టణం, పరకాల రూరల్, శాయంపేట, ఆత్మకూరు, దామెర మండలాల విద్యుత్ వినియోగదారులు పాల్గొని విద్యుత్ సమస్యలు, ఫిర్యాదులను రాతపూర్వకంగా సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎస్.వీ వేణుగోపాలచారికి అందించాలని కోరారు. ఓల్టేజీ హెచ్చు తగ్గులు, విద్యుత్ పునరుద్ధరణ, బిల్లింగ్ సమస్యలు, కాలిన ట్రాన్స్‌ఫార్మర్ మార్చటం, నూతన సర్వీస్‌లు మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ మార్పు, కేటగిరీ మార్పు, సర్వీస్ రద్దు చేయడం వంటి సమస్యలపై దరఖాస్తులు, ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. విద్యుత్ శాఖ జిల్లా అధికారులతో పాటు డివిజనల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

శ్రీరామ రజక సంఘం అధ్యక్షుడిగా తిరుపతి



కమలాపూర్ : శ్రీరామ రజక సంఘం కమలాపూర్ పట్టణ అధ్యక్షుడిగా ఆవునూరి తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం సభ్యులు సోమవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వైనాల సుభాశ్, ప్రధానకార్యదర్శిగా వైనాల నరేశ్, కార్యదర్శిగా రాముల అశోక్, కోశాధికారిగా వైనాల సుభాశ్, డైరెక్టర్లుగా దేవరాజు రాజయ్య, కొత్తకొండ చిన్న కొమురయ్య, మామిండ్లపల్లి నాగరాజు, వైనాల పెద్ద సాంబయ్య, కోడెపాక రవి, రామారపు కుమారస్వామి ఎన్నికయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన రాయపురం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతడితో పాటు 2012–13 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.12వేలు ఆర్థికసాయం అందించారు. పూర్వ విద్యార్థులు రాజారపు రాజ్‌కుమార్, జంపాల రాజు, పైండ్ల సంతోశ్, ఆరెల్లి మధు, కట్టబోయిన హరీశ్, పబ్బోజు రాజశేఖర్, గద్దల రమేశ్, పోలెపాక మహేశ్వర్, రాజారపు రాకేశ్, మునిగాల రాజు, శశికాంత్, అఖిల్, మహేశ్, శ్రీకాంత్, నరేశ్, రాజు, మధు, అనిల్, ప్రశాంత్, మహేందర్, రంజిత్, ఉదయ్, శ్రీజ, సుప్రియ, రాయుడు, సాయి ఉన్నారు.

ఆర్థికసాయం అందించిన కడియం



వేలేరు : మండల కేంద్రానికి చెందిన ఎండీ.సుల్తానా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండగా మాజీ సర్పంచ్ మల్లికార్జున్ ద్వారా విషయం తెలుసుకున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆర్థికసాయం అందించారు. ఆమె స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు మిషన్ కొనుగోలు చేసుకోవాలని సూచిస్తూ ఎమ్మెల్యే శ్రీహరి రూ.15వేలు అందించగా మాజీ సర్పంచ్ మల్లికార్జున్ రూ.5వేలు అందించారు. ఎండీ.యూసుఫ్, రషీద్ ఉన్నారు.

ప్రకృతి పండుగ తీజ్



నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని 15వ వార్డులో తీజ్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జాటోత్ ఉదయ్‌సింగ్, పూజారి గౌరవ అధ్యక్షుడు జాటోత్ జేతురాం నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తీజ్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రకృతి పండుగ తీజ్ సందర్భంగా గోధుమ గింజలను తొమ్మిది రోజుల పాటు బుట్టలో పెంచి ప్రతీ రోజు ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకలు నిర్వహిస్తామన్నారు. పెళ్లి కాని ఆడ పిల్లలతో పవిత్రమైన గంగా నీటితో గోధుమ నారును పెంచడం జరుగుతుందన్నారు. తొమ్మిదో రోజు సేవాలాల్ మహరాజ్‌కు నైవేద్యం సమర్పించి నెయ్యితో అగ్నిహోత్రికి హోమం నిర్వహించడం ఆచారమన్నారు. అనంతరం గోధుమ నారు బుట్టలను ఆట పాటలతో నృత్యం చేస్తూ నిమజ్జనం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ధరావత్ వీరన్న, జాటోత్ చందర్ సింగ్ పాల్గొన్నారు.

గట్టుమల్లన్న ఆలయానికి మహర్దశ



మల్లికుదుర్ల శివారులోని గట్టు మల్లికార్జునస్వామి ఆలయం



నిర్మాణంలోఉన్న భవనం



ఆలయం ఎదుట నిర్మిస్తున్న ముఖద్వారం

- రూ.50 లక్షలతో ముఖమండపం పనులు ప్రారంభం
- రూ. 11లక్షలతో ముఖద్వారం నిర్మాణం
- ముందుకు వస్తున్న దాతలు

వేలేరు : పురాతన చరిత్ర కలిగిన దేవాలయాల్లో గట్టు మల్లికార్జునస్వామి ఆలయం ఒకటి. మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల గట్టు మల్లికార్జునస్వామి దేవాలయంలో పలు అభివృద్ధి పనులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి సీజీఎఫ్ నిధులు మంజూరు చేసింది. అలాగే దాతలు కూడా ఆలయ అభివృద్ధికి ముందుకు వస్తున్నారు. నారాయణగిరి గ్రామం నుంచి మల్లికార్జునస్వామి ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అలాగే ఆలయానికి పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అప్పటి పట్టభద్రుల ఎమ్మెల్సీ, ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి సహకారంతో సీజీఎఫ్ నిధులు రూ.50లక్షలు మంజూరు చేయగా ముఖమండప నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అదే విధంగా దేవాలయ ముఖద్వారం నిర్మించేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వంతగా రూ.11 లక్షలు ఆర్థికసాయం అందించారు. ఆలయ నిర్మాణ పనులకు దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు. దీంతో ఆలయానికి మహర్దశ రానుందని భక్తులు, ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దేవాలయ అభివృద్ధే లక్ష్యం



ప్రముఖ పుణ్యక్షేత్రమైన గట్టుమల్లన్న ఆలయ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఆలయానికి వచ్చే భక్తులకు నిత్య అన్నదానం, నిత్య పూజలు జరిపించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అలాగే దాతల సహకారంతో మరికొన్ని రోజుల్లో పరిసరాల్లో కాటేజీల నిర్మాణం, ఎల్లమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నాం. ఆలయ భూములను పరిరక్షించేందుకు హద్దులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు లేఖ రాశాం. ఆలయం చుట్టూ గోడ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించనున్నాం. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకువచ్చి తమవంతు సహకారం అందించాలి.

– అద్దంకి నాగేశ్వరరావు, ఆలయ ఈఓ

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల విరాళం



ఆర్థికసాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

హన్మకొండ (పరకాల) : తాము చదువుకున్న పాఠశాల మరికొంత మంది విద్యార్థులకు బంగారు బాట చూపించాలనే ఉద్దేశ్యంతో ఆ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ. 20 వేలు విరాళం అందించారు. పట్టణంలోని సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఈనెల 11వ తేదీన జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పలు సమస్యలను ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన వారు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి సేకరించిన డబ్బుల నుంచి కొంత పాఠశాల అభివృద్ధికి కేటాయిస్తూ డీడీ రూపంలో ఉపాధ్యాయులకు అందించారు. అదే విధంగా పాఠశాల విద్యార్థులకు కుర్చీలు అందించారు. భవిష్యత్‌లో మరింత సాయం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎబ్బీ, ఉపాధ్యాయుడు రవీందర్, పూర్వ విద్యార్థులు జనార్దన్‌రావు, సోమేశ్వర్, ఎండీ. నూర్ మహ్మద్, బొచ్చు జగదీశ్వర్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ రాక

ఎల్కతుర్తి : మండల కేంద్రానికి రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మంగళవారం రానున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్థానిక రైతువేదికలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'గండ్రను విమర్శించే స్థాయి కాదు'

శాయంపేట : మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని మైలారం మాజీ సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఎనిమిది నెలల్లో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిందే వెంకటరమణారెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపల్లి నందం, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు శివ, గ్రామశాఖ అధ్యక్షుడు రాజేందర్, నాయకులు వెంకట్ పాల్గొన్నారు.

వైద్యాధికారిగా మంజుల

దామెర : మండల వైద్యాధికారిగా డాక్టర్ మంజుల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెలరోజుల క్రితం ఇక్కడే విధులు నిర్వర్తించిన ఆమె.. ఇటీవల ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి బదిలీ అయ్యారు. కాగా ఆమె స్థానంలో డాక్టర్ రాంబాబును దామెరకు బదిలీ చేశారు. అయితే శనివారం వీరి బదిలీలను రద్దుచేస్తు అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో తిరిగి మంజుల దామెర మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఐనవోలు : ఇటీవల కూతురుతో పాటు ఆత్మహత్యకు పాల్పడిన జర్నలిస్ట్ యోగి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జీఎంపీఎస్ మండల కార్యదర్శి నల్లబెల్లి చిన్నరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడటం బాధకరమని అన్నారు. నిత్యం ఎన్నో సమస్యలను ఎత్తిచూపి సామాజిక సేవ చేసే విలేకరులకు ఇలాంటి దుస్థితి రావడం శోచనీయమన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.5లక్షల ఆర్థికసాయం, డబుల్ బెడ్రూం ఇల్లు అందించాలని విజ్ఞప్తి చేశారు. పాలకులు సైతం స్పందించాలని కోరారు.

బాధిత చిన్నారులకు అండగా నిలవండి



రుత్విక్, అశ్రిత్

కమలాపూర్ : తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన కమలాపూర్‌కు చెందిన ఇద్దరు చిన్నారులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని ప్రగతి యూత్ అసోసియేషన్, ప్రగతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పబ్బు సతీశ్, కమలాపూర్ కౌండిన్య బలగం గ్రూపు సభ్యులు, గౌడ కులస్తులు కోరారు. మండల కేంద్రానికి చెందిన మేడిపెల్లి నరేశ్–లలిత దంపతులకు ఇద్దరు కుమారులు రుత్విక్, అశ్రిత్ ఉన్నారు. సుమారు పదేళ్ల క్రితం వీరి తల్లి లలిత మృతి చెందగా.. వీరి నానమ్మ అనసూర్య చిన్నారుల బాగోగులు చూసుకునేదని, రెండేళ్ల క్రితం ఆమె కూడా అనారోగ్యంతో మృతిచెందిందని తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రి నరేశ్ ఇటీవల మృతిచెందినట్లు తెలిపారు. దీంతో రుత్విక్, అశ్రిత్ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉంటూ స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రుత్విక్ పదోతరగతి, అశ్రిత్ ఎనిమిదో తరగతి చదువుకుంటున్నారన్నారు. కడుపేదరికంలో ఉన్న ఇద్దరు చిన్నారులు తమ తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలారని, అందరూ అండగా నిలవాలని కోరారు. ప్రతిఒక్కరూ తలోకొంత ఆర్థికసాయం అందించి వారి చదువును ప్రోత్సహించాలని కోరారు.

రంగనాథన్ సేవలు చిరస్మరణీయం



రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వక్తలు, పాఠకులు

ఎల్కతుర్తి : భారత గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయ కమిటీ సభ్యులు, పాఠకులు కొనియాడారు. జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా ఆయన 132వ జయంతిని సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ప్రజా గ్రంథాలయంలో నాయకులు, వక్తలు, పాఠకులు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. ముల్కనూరులో ప్రజా గ్రంథాలయం ఏర్పాటు చేసి సుమారు 10 సంవత్సరాలు అవుతోందన్నారు. ఈ గ్రంథాలయానికి ఎంతోమంది దాతలు, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులు, విద్యావంతులు, మేధావులు సహకారం అందించారని గుర్తు చేశారు. ఎంతోమంది నిరుపేద విద్యార్థులను ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నతస్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దిన బండాగారం ప్రజా గ్రంథాలయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పల్లా ప్రమోద్‌రెడ్డి, మాడుగుల కొమురయ్య, ఎదులాపురం తిరుపతి, తాళ్ల వీరేశం, గ్రంథాలయ పాఠకులు తదితరలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గ్రీవెన్స్ సెల్‌లో వినతి



నడికూడ : ఎల్‌డీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ (పరకాల): సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పరకాల సివిల్ ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరుగుతోందని ఆస్పత్రిలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంఎస్‌వీ, టీఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా అధికారులకు వినితిప్రతం అందించారు. రాత్రివేళలో ఆసుపత్రి ఆవరణలోనే పశువులు సంచరిస్తున్నాయని తెలిపారు. మరోవైపు విద్యుత్ అంతరాయం కలిగితే రోగులు చీకట్లో ఉండాల్సిన దుస్థితి ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదే విధంగా రాత్రి వేళలలో సెక్యూరిటీగార్డు లేకపోవడంతో రోగులకు రక్షణ లేదని, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటరుణాలు మంజూరు చేయాలి..

నడికూడ : రుణమాఫీ పొందిన రైతులను బ్యాంకర్లు ఇబ్బందులకు గురిచేయకుండా మళ్లీ రుణాలు అందించేలా చూడాలని పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకట్‌రామ్‌రెడ్డి, ఎల్‌డీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. పంటరుణాల కోసం రైతులు వేచిచూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. బ్యాంక్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని కోరారు. రైతురక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు కొమురారెడ్డి, జిల్లా నాయకుడు బాపురావులు వినతిత్రపం అందించిన వారిలో ఉన్నారు.

పేదలకు కంప్యూటర్ విద్యే లక్ష్యం

సంగెం : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు సైతం కంప్యూటర్ విద్యనందించేందుకే పుట్టిన ఊరిలోని ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లు బహూకరించినట్లు దాత బోయినపల్లి శ్రుతి–అనిల్‌రావు అన్నారు. మండలంలోని కాపులకనిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ బోయినపల్లి శ్రుతి–అనిల్‌రావు దంపతులు 2017లో పాఠశాలకు 10 కంప్యూటర్లు, ప్రొజెక్టర్‌ను అందజేయడంతో పాటుగా నెలనెల వేతనం ఇస్తూ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించారు. సోమవారం దాత శ్రుతి తన కూతుళ్లు శ్రీపా, అనియాతో కలిసి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంత వరకు నేర్చుకున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో కంప్యూటర్ విద్య జీవనోపాధికి ఊతం ఇస్తుందని, విద్యార్థులు కంప్యూటర్ విద్యను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు సీతాదేవి, ఉపాధ్యాయులు రాజన్న, వెంకటేశ్వర్లు, స్వప్నకుమారి, రవీందర్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- ఫీల్డ్ ఫెసిలిటర్ కల్పన



సమావేశంలో మాట్లాడుతున్న కల్పన

శాయంపేట : పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఫీల్డ్ ఫెసిలిటర్ కుక్కల కల్పన అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం సుస్థిరమైన జీవనోపాధి, మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా 42 మంది మహిళా సభ్యులకు అవగాహన కల్పించారు. మహిళలు తమ నిర్ణయం తాము తీసుకునేలా ఎదగాలని, ఆర్థికంగా బలపడినప్పుడే కుటుంబంలో పురోగతి ఉంటుందన్నారు. మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు న్యాక్ ఆర్గనైజేషన్ సంస్థ సహకారంతో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణకు 35మంది మహిళలను ఎంపిక చేసినట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధి సబిత, మారపల్లి సుమలత, రేణుకుంట్ల స్రవంతి, మీనా, మున్ని హేమలత, శ్రీలత పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

హన్మకొండ (పరకాల) : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ స్వాతి అన్నారు. సోమవారం పైడిపల్లి గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మురుగునీరు నిల్వకుండా, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కాచి వడబోసిన మంచినీటిని మాత్రమే తాగాలని అన్నారు. లేనిపక్షంలో డెంగీ, మలేరియా, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితోపాటు ఆశా వర్కర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

దామెర : విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని డిస్నీల్యాండ్ పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ డిస్నీల్యాండ్ పాఠశాలలో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ పీపుల్ లీడర్ కోసం 13 మంది, డిప్యూటీ స్కూల్ పీపుల్ లీడర్ కోసం 15 మంది విద్యార్థులు పోటీ చేసినట్లు తెలిపారు. స్కూల్ పీపుల్ లీడర్‌గా పదోతరగతి విద్యార్థి మద్దూరి శ్రీకాంత్ తన సమీప అభ్యర్థి నకిరె కావ్యపై 148 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు తెలిపారు. డిప్యూటీ లీడర్‌గా 9వ తరగతి విద్యార్థి యాహశెట్టి మల్లికార్జున్ తన సమీప అభ్యర్థి ప్రీతిక్‌పై 7 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం కల్పించిన ఓటుహక్కుతో సరైన లీడర్‌ను ఎన్నుకోవాలని అన్నారు. భవిష్యత్తులో రాజకీయ నాయకులుగా ఎదిగి ప్రజలకు నిస్వార్థంగా సేవచేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, డైరెక్టర్లు దయ్యాల రాకేశ్‌భాను, దినేశ్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఓటింగ్‌లో 850 మంది విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆమె వెల్లడించారు.

పద్మశాలీలు ఓటుహక్కు వినియోగించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

ఆత్మకూరు : ఈనెల 18వ తేదీన జరగబోయే రాష్ట్ర పద్మశాలి అధ్యక్ష పదవి ఎన్నికల్లో పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొని ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు వెల్దె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పద్మశాలి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల అధ్యక్షుడు వెల్దే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలి కుల బాంధవులు ఈనెల 18 తేదీన జరిగే ఎన్నికల్లో పాల్గొని ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. జిల్లా జాయింట్ సెక్రటరీ సదానందం, మండల కమిటీ ఉపాధ్యక్షులు రవి, రాజమౌళి, మండల కోశాధికారి ప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు సదానందం, ఆత్మకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు వేణు, గ్రామ కార్యదర్శి కేదారి, యూత్ అధ్యక్షుడు రంజిత్‌కుమార్, యూత్ కోశాధికారి రవి, మండల పంచాయతీ కమిటీ అధ్యక్షుడు రాజేందర్, భిక్షపతి, శీను, వెంకటేశ్వర్లు, సంజయ్, సుదర్శన్ పాల్గొన్నారు.

లేబర్‌కార్డుల పేరుతో అక్రమ దందా



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

శాయంపేట : మండలానికి చెందిన కొందరు వ్యక్తులు లేబర్ జారీ చేయిమస్తామని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బీజేపీ మండల ప్రధానకార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ తెలిపారు. కేంద్రం ప్రభుత్వం ద్వారా జారీ అయ్యే లేబర్ కార్డులను తాము త్వరగా మంజూరు చేసేలా చూస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. లేబర్ కార్డు లబ్ధిదారుల కుటుంబంలో ప్రసవం, మరణం సంభవించినా వారి వివరాలను తెలుసుకుని లబ్ధిదారులకు ఇన్సూరెన్స్ క్లెయించేపిస్తామని చెప్పి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన పలు కుటుంబాల దగ్గర లేబర్‌కార్డు ద్వారా ఇన్సూరెన్స్ క్లెయిం కాగా వారి నుంచి సగభాగం డబ్బులు వసూలు చేశారని, దీనికి ఏఎల్ఓ కార్యాలయంలోని కొంతమంది అధికారులు కూడా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టి వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ స్వప్నరెడ్డి

దామెర : మండల కేంద్రంలో పునర్నిమిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బిల్లా మధుసూదన్‌రెడ్డి జ్ఞాపకార్థం తన కూతురు ఎన్ఆర్ఐ ఎర్ర స్వప్న వెంకటరమణారెడ్డి రూ.5లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం తమవంతు సాయం అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని అన్నారు. రానున్న రోజుల్లో తన తండ్రి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈనెల 19, 20, 21వ తేదీల్లో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. కమిటీ చైర్మన్ రాజేందర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు రమణారెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి, ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.